జీఎన్‌ఐటీఎస్‌లో హెల్త్‌ క్యాంప్‌



హెల్త్‌ క్యాంప్‌లో జీఎన్‌ఐటీఎస్‌ చైర్మన్‌ రాఘవరెడ్డితో అధ్యాపకులు, ఆరోగ్య సిబ్బంది

గోల్కొండ: విద్యార్థులే కాకుండా బోధన, బోధనేతర సిబ్బంది క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్‌ కళాశాల చైర్మన్‌ జి.రాఘవరెడ్డి అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్‌ ఫౌండేషన్‌ డే సందర్భంగా గురువారం కళాశాలలో హెల్త్‌ క్యాంప్‌ నిర్వహించారు. మాదాపూర్‌కు చెందిన పిక్యూ హెల్త్‌ సెంటర్‌ వైద్యులు, వైద్య సిబ్బంది సేవలు అందించారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉంటే సాధించలేనిది ఏది ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ కె.రమేష్‌రెడ్డి, అడ్మినిస్ట్రేషన్‌ డీన్‌ అవదాని, హెడ్‌ రామ్మోహన్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ రమశ్రీ, కోఆర్డినేటర్‌ డాక్టర్‌ నీలి రమేష్‌, మేజర్‌ రాకేష్‌ గులాటీ, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

పీస్‌ అంబాసిడర్‌గా మహ్మద్‌ నజీబ్‌



డాక్టర్‌ మహ్మద్‌ నజీబ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: శాంతిని నెలకొల్పడమే తమ ప్రధాన ఆశయమని ఇంటర్నేషనల్‌ హ్యూమన్‌ రైట్స్‌ ఆర్గనైజేషన్‌ తెలంగాణ చైర్మన్‌ మహ్మద్‌ నజీబ్‌ అన్నారు. ఇంటర్నేషనల్‌ హ్యూమన్‌ రైట్స్‌ ఆర్గనైజేషన్‌, ఇంటర్నేషనల్‌ బార్‌ అసోసియేషన్‌ వారు మహ్మద్‌ నజీబ్‌కు పీస్‌ అంబాసిడర్‌గా నియమిస్తూ డాక్టరేట్‌ ప్రకటించారు. ఈ సందర్భంగా టోలిచౌకీలో మహ్మద్‌ నజీబ్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ..ఇంటర్నేషనల్‌ హ్యూమన్‌ రైట్స్‌ ఆర్గనైజేషన్‌ జాతీయ అధ్యక్షుడు నేమ్‌సింగ్‌ ప్రేమి ప్రోత్సాహంతో తాను సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ 13 ఏళ్లు పూర్తి చేసుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఖాలేద్‌ ఆలీఖాన్‌, కుర్షిద్‌, నవాబ్‌, పర్వేజ్‌, తౌఫిక్‌, షపత్‌ తదితరులున్నారు.

ప్రైవేటు డ్రైవర్ల సంక్షేమానికి మజ్లిస్‌ కృషి



అబిడ్స్‌/గోల్కొండ: ప్రైవేటు డ్రైవర్ల సంక్షేమానికి, అభివృద్ధికి మజ్లిస్‌ పార్టీ కృషి చేస్తుందని మజ్లిస్‌ పార్టీ ఎమ్మెల్యే మాజీద్‌ హుస్సేన్‌ పేర్కొన్నారు. మెహిదీపట్నంలో నూతనంగా టెంపో ట్యాక్సీ స్టాండ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాజీద్‌హుస్సేన్‌ మాట్లాడుతూ.. ప్రైవేటు డ్రైవర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ ఇండియా ట్రక్కర్స్‌, డ్రైవర్స్‌ ప్రెసిడెంట్‌ మహ్మద్‌ అక్బర్‌, మహ్మద్‌ సాబేర్‌, మహ్మద్‌ జహంగీర్‌, షేక్‌ వహీద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ ఆక్రమణలు తొలగించండి



డిప్యూటీ కమిషనర్‌ విద్యాధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్‌ గౌడ్‌

అబిడ్స్‌: గోషామహల్‌ నియోజకవర్గంలో ఫుట్‌పాత్‌ ఆక్రమణలను తొలగించాలని గోషామహల్‌ నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌ గౌడ్‌ పేర్కొన్నారు. 14వ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ విద్యాధర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆనంద్‌కుమార్‌గౌడ్‌ మాట్లాడుతూ..పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను వ్యాపారస్తులు అడ్డగోలుగా ఆక్రమించడం ద్వారానే తరచూ ట్రాఫిక్‌ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ప్రతిరోజూ గంటల కొద్దీ ట్రాఫిక్‌ స్తంభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగిస్తే ట్రాఫిక్‌ సమస్యలు తగ్గుముఖం పడుతాయన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్‌ సానుకూలంగా స్పందించారు. వెంటనే అక్రమ ఫుట్‌పాత్‌లను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అహ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌ బాగ్‌ మూసీ పరీవాహక బస్తీల్లో అధికారుల పర్యటన



కిషన్‌బాగ్‌లో వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో మైపాల్‌ రెడ్డి, తహసీల్దార్‌ చంద్రశేఖర్‌

చార్మినార్‌/బహదూర్‌పురా: బహదూర్‌పురా మండల పరిధిలోని కిషన్‌ బాగ్‌ మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న బస్తీలలో రెవెన్యూ అధికారులు పర్యటించారు. మూసీ సుందరీకరణలో భాగంగా మూసీ పరివాహ ప్రాంతాల్లోని ఎఫ్‌టీఎల్‌ పరిధిలో నివాసముంటున్న స్థానికులను అక్కడి నుంచి తొలగించి ఇతర ప్రాంతాలకు తరలించడం కోసం చేపడుతున్న చర్యల్లో భాగంగా గురువారం అధికారుల పర్యటన కొనసాగింది. హైదరాబాద్‌ జిల్లా ఆర్డీవో మైపాల్‌ రెడ్డితో పాటు బహదూర్‌ పురా తహసీల్దార్‌ చంద్రశేఖర్‌ తదితరుల బృందం బస్తీలలో పర్యటించి అవసరమైన చర్యలు చేపట్టింది. తొలగించాల్సిన గృహ నిర్మాణాలను ఇతర షెడ్లను గుర్తించి రెడ్‌ మార్కు చేశారు. ఈ విధంగా 253 నివాసాలను గుర్తించి అందులో నివసిస్తున్న వారికి నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్‌ తెలిపారు. తమ ఇల్లు తొలగిస్తున్నారని సమాచారం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున గుమికూడి అధికారులను అడ్డుకొని వాగ్వావాదానికి దిగారు. ఇల్లు కోల్పోతున్న వారికి డబుల్‌ బెడ్‌ రూములు ఇవ్వనున్నమని సంబంధిత అధికారులు బాధితులకు సర్ది చెప్పారు. ప్రస్తుతం నాలా లోపలికి ఉన్న నివాసాలను మాత్రమే గుర్తించామని బఫర్‌ జోన్‌లో ఉన్న నివాసాల జోలికి వెళ్లడం లేదని తహసీల్దార్‌ తెలిపారు. బహదూర్‌పురా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

గోల్కొండ: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. బీజేపీ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌ చౌరస్తా వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌ మోర్చా ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్‌, రాధాకృష్ణ, శ్రీకాంత్‌సాగర్‌ తదితరులున్నారు.

ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

నాంపల్లి: చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని తెలంగాణ రజక సంఘాల నేతలు డిమాండ్‌ చేశాయి. ఈ మేరకు గురువారం గన్‌పార్కు వద్ద చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలను చల్లి నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్‌, షాద్‌నగర్‌ ఎమ్మెల్యే శంకర్‌ రజక సంఘాలను కలుపుకొని పోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారని రజక సంఘాల ఆరోపించారు. మహిళా విశ్వవిద్యాలయానికి ఐలమ్మ పేరు పెట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు పెద్దాపురం కుమారస్వామి, మొగ్గ అనిల్‌, కె.సంపత్‌, దుబ్బాక రమేష్‌, పి.ఆంజనేయులు, బాలాపూర్‌ బాలరాజు, ప్రశాంత్‌, వెంకటేష్‌, మహేందర్‌, కానుగుల అభి, పగిళ్ల సందీప్‌ తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో..

అబిడ్స్‌: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీభవన్‌లో జరిగిన వేడుకల్లో రాష్ట్ర ఫిషరీష్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మెట్టు సాయికుమార్‌ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్‌ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చాకలి ఐలమ్మ పేరును చిరస్మరణీయంగా ఉండే విధంగా కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి పెట్టడం ఎంతో అభినందనీయమన్నారు. తెలంగాణ యోధురాలి సముచిత గుర్తింపును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా గుర్తించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్‌ నాయకులు కుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గుడిమల్కాపూర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్‌ తదితరులు

గన్‌ఫౌండ్రీలో..

గన్‌ఫౌండ్రీ: చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో భాగంగా రాష్ట్ర కాంగ్రెస్‌ ఓబీసీ సెల్‌ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్‌ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్‌, వెన్ను శివకుమార్‌, పోల్కం వినయ్‌రాజ్‌, కోట్ల శ్రీనివాస్‌, పల్లాల నవీన్‌కుమార్‌, బాబన్నలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న టీపీసీసీ ఓబీసీ సెల్‌ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్‌



చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న నేతలు



నివాళులర్పిస్తున్న చైర్మన్‌ మెట్టు సాయికుమార్‌

అభినందనలు



చార్మినార్‌: శాంతి భద్రతల పరిరక్షణలో స్థానికులు అప్రమత్తంగా ఉంటూ అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు సహకరించడం సంతోషకరమని నగర పోలీస్‌ కమిషనర్‌ సీవీ ఆనంద్‌ అన్నారు. ఇటీవల జరిగిన మిలాద్‌ ఉన్‌ నబి ర్యాలీ సందర్భంగా పాత బస్తీలో ఇరు వర్గాల ప్రజల్లో స్వల్ప ఘర్షణ తలెత్తడంతో చార్మినార్‌ ప్రాంతానికి చెందిన రిజ్వాన్‌ అనే స్థానికుడు వెంటనే స్పందించి రెండు వర్గాలను శాంతింపచేయడం అభినందనీయమన్నారు. ఈ మేరకు నగర పోలీస్‌ కమిషనర్‌ రిజ్వాన్‌కు మెమెంటో అందజేసి అభినందనలు తెలిపారు.

బీజేపీతోనే భారత్‌ సుభిక్షం



అఫ్జల్‌గంజ్‌: బీజేపీతోనే భారత్‌ సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉంటుందని గోషామహల్‌ బీజేపీ కార్పొరేటర్‌ లాల్‌సింగ్‌ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ హయాంలో భారతదేశం అన్నిరంగాల్లో ప్రపంచంలోనే అగ్రగామిగా దూసుకుపోతుందన్నారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వశర్మను ఆయన కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లాల్‌సింగ్‌ మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజలు బీజేపీ ప్రభుత్వ హయాంలో సుఖ సంతోషాలతో జీవనం గడుపుతున్నారని పేర్కొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి: ఎమ్మెల్యే

గోల్కొండ: మజ్లిస్‌ ఏరియా కమిటీ ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్‌ అన్నారు. గురువారం ఆయన మజ్లిస్‌ నాయకులు, బల్దియా అధికారులతో కలిసి టోలిచౌకీ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నదీమ్‌ కాలనీ, విరాసత్‌నగర్‌ కాలనీ, శాతం చెరువు ఎగువ ప్రాంతం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. శాతం చెరువు తూము నుంచి బయటకు వదులుతున్న నీటిని ఆయన పరిశీలించారు. ఈ నీరు గోల్కొండ కోట కందకాల గుండా లంగర్‌ హౌస్‌ లక్ష్మీనగర్‌ నాలా నుంచి మూసీలో కలుస్తుందన్నారు. మధ్యలో భగ్దాద్‌ కాలనీ, అహ్మద్‌ కాలనీలో వర్షాలు కురిసినప్పుడు ఈ నాలా పొంగిపొర్లుతూ వరద నీరు పరిసర ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి చొచ్చుకువస్తుందని ఈ ప్రాంతాల్లోని మజ్లిస్‌ నాయకులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. మజ్లిస్‌ టోలిచౌకీ డివిజన్‌ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్‌, బల్దియా ఏఈ ఉదయ్‌కుమార్‌, నాయకులు అలీముద్దీన్‌, అబీబ్‌ చౌస్‌ తదితరులున్నారు.



అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌

రివర్‌ బెడ్‌ ఆధారంగా మళ్లీ సర్వే చేయండి

లంగర్‌హౌస్‌: మూసీ పరీవాహక అభివృద్ధిలో భాగంగా బఫర్‌ జోన్‌ పరిధిలో తహసీల్దార్‌ పర్యటన సందర్భంగా ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. గోల్కొండ మండల పరిధిలోని తహసీల్దార్‌ అహల్య ఆధ్వర్యంలో గురువారం లంగర్‌హౌస్‌లోని అంబేద్కర్‌నగర్‌, డిఫెన్స్‌ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్‌, బాపునగర్‌ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ నివాసితుల పూర్తి వివరాలు, వారు ఎప్పటి నుంచి అక్కడ నివసిస్తున్నారనే వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్‌నగర్‌లో బస్తీవాసులు అధికారులకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. రివర్‌ బెడ్‌ను ఆధారంగా తీసుకొని మూసీ మధ్యలో నుంచి మరోసారి సరైన సర్వే నిర్వహించాలన్నారు. లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు. దీంతో ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌ ఆధ్వర్యంలో అదనపు బలగాలు రప్పించి పోలీసు బందోబస్తు మధ్య వివరాలు సేకరించి ఇళ్లకు మార్క్‌ వేశారు.



మూసీ నదిలో భవనాలకు మార్క్‌ చేయిస్తున్న తహసీల్దార్‌ అహల్య

హుక్కా సెంటర్‌పై టాస్క్‌ ఫోర్స్‌ పోలీసుల దాడి

చార్మినార్‌: పాతబస్తీలో నిబంధనలకు విరుద్ధంగా హుక్కా సెంటర్‌ నిర్వహిస్తున్న నిందితుడితో పాటు మరో ఆరుగురు కస్టమర్లను దక్షిణ మండలం టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు బహదూర్‌పురా పోలీసులతో కలిసి హుక్కా కేంద్రంపై దాడులు నిర్వహించారు. కామాటిపురా తాడ్‌బన్‌కు చెందిన మహమ్మద్‌ అబ్దుల్‌ ముజామిల్‌ 26 ‘ద వుల్ఫ్‌ కేఫ్‌ అండ్‌ లాంజ్‌’ అనే కాఫీ షాప్‌ కొంత కాలంగా నిర్వహిస్తున్నారు. ఆశించిన స్థాయిలో ఆదాయం లభించకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత నికోటిన్‌ ఇతర ఫ్లేవర్లతో కూడిన హుక్కాలను కస్టమర్లకు సర్వ్‌ చేస్తూ అధిక లాభాలు పొందుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు దక్షిణ మండలం టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు ఈ కేంద్రంపై దాడులు నిర్వహించి నిందితునితో పాటు మరో ఆరుగురు కస్టమర్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.30 వేల విలువ చేసే 19 హుక్కా పాట్స్‌, 5 ఫ్లేవర్స్‌, 6 హుక్కా కాయిల్స్‌ను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం బహదూర్‌పురా పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

అబిడ్స్‌: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీఎన్జీఓస్‌ యూనియన్‌ హైదరాబాద్‌ జిల్లా అసోసియేట్‌ ప్రెసిడెంట్‌ కేఆర్‌.రాజ్‌కుమార్‌, విద్యాశాఖ హైదరాబాద్‌ జిల్లా టీఎన్జీఓస్‌ కార్యదర్శి ఎం.భాస్కర్‌, ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ ఫిరోజ్‌ అహ్మద్‌ పేర్కొన్నారు. ఉద్యోగులకు సంబంధించి పలు సమస్యలను జాయింట్‌ యాక్షన్‌ కమిటీ చైర్మన్‌ టీఎన్జీఓస్‌ సెంట్రల్‌ అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌, సెంట్రల్‌ ప్రధాన కార్యదర్శి ముజీబ్‌ హుస్సేనికు వినతిపత్రం అందజేశారు. స్కూల్‌ ఎడ్యుకేషన్‌లో ఉన్న సమస్యలను మెమోరాండం ద్వారా వారి దృష్టికి తీసుకువెళ్లారు. జీఓ నెంబర్‌ 317 ప్రకారం ..16 మంది ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి వారి ప్రమోషన్లు ఇప్పించాలన్నారు. మరో అసిస్టెంట్‌ డైరెక్టర్‌ పోస్టును డీఈఓ కార్యాలయంలో కేటాయించే విధంగా కృషి చేయాలన్నారు. మిడ్డేమీల్స్‌కు అడ్మినిస్ట్రేటివ్‌ శాంక్షన్‌లు మరిన్ని ఇప్పించాలన్నారు. విద్యాశాఖలోని ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ద్వారా పరిష్కరించే విధంగా తగు కృషి చేయాలన్నారు.



కొనసాగుతున్న క్రీడా పోటీలు

చాంద్రాయణగుట్ట: హైదరాబాద్‌ జిల్లా స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ 68వ ఇంటర్‌ స్కూల్స్‌ లెవల్‌ టోర్నమెంట్‌ సెలక్షన్స్‌ టోర్నమెంట్‌ శంషీర్‌గంజ్‌లోని శారద విద్యాలయలో రెండో రోజు హోరాహోరీగా కొనసాగింది. కబడ్డీ, ఖోఖోలలో ఆయా జట్లు తలపడి ఫైనల్‌ బెర్త్‌లోకి చేరుకున్నాయి. శుక్రవారం జరుగనున్న ఫైనల్‌లలో బాలలు, బాలికలు అండర్‌–17, 14 విభాగాలలో తలపబడి కప్‌లను సాధించనున్నాయి. టోర్నమెంట్‌ కార్యనిర్వాహక కార్యదర్శి వి.శ్రీను నాయక్‌ ఆధ్వర్యంలో ఈ పోటీలు కొనసాగుతున్నాయి.



ఐఎంఏ కమిటీకి ఎన్నికల షెడ్యూల్‌ విడుదల



మాట్లాడుతున్న విజయ్‌చందర్‌రెడ్డి

సుల్తాన్‌బజార్‌: ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ తెలంగాణ రాష్ట్ర కమిటీకి ఎన్నికల నోటిఫికేషన్‌ విడుదలయ్యింది. గురువారం కోఠిలోని ఐఎంఏ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎలక్షన్‌ కమిషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ పి.విజయ్‌చందర్‌రెడ్డి, కన్వీనర్‌ డాక్టర్‌ విజేంద్రరెడ్డి, సభ్యులు డాక్టర్‌ పీఆర్‌.సాయికుమార్‌ వివరాలు వెల్లడించారు. అక్టోబర్‌ 27న ఆదివారం కోఠిలోని ఐఎంఏ ఆడిటోరియంలో ఐఎంఏ రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు లక్షల సభ్యత్వం గల ఐఎంఏలో తెలంగాణ రాష్ట్రంలో 20 వేల మంది సభ్యులు 76 బ్రాంచ్‌ల్లో కమిటీలు ఉన్నాయని మొత్తం 17 కేటగిరిలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ నెల 27 నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని అక్టోబర్‌ 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. 11న స్క్రూటీని చేస్తామని 15న ఉపసంహరణ ఉంటుందన్నారు. 27న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్యాలెట్‌ ద్వారా ఎన్నికలు జరుగుతాయని, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఈ సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర గౌరవ కార్యదర్శి డాక్టర్‌ జె.విజయరావు, ఫైనాన్స్‌ సెక్రెటరి డాక్టర్‌ రాజేంద్రకుమార్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

బాంబు పెట్టారని ఫేక్‌ కాల్‌ చేసిన వ్యక్తి అరెస్ట్‌

లంగర్‌హౌస్‌: ఫ్లై ఓవర్‌పై బాంబు పెట్టారని ఫేక్‌ బెదిరింపు కాల్‌ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై రాజు తెలిపిన కథనం ప్రకారం..బాగ్దాద్‌ కాలనీలో నివాసముండే అబ్దుల్‌ ఇమ్రాన్‌ ప్రైవేట్‌ ఉద్యోగి. ఈనెల 25 రాత్రి ఇతను బాగా తాగి భార్యతో గొడవ పడి బయటకు వచ్చాడు. లంగర్‌హౌస్‌లోని పి.ఇంద్రారెడ్డి ఫ్లై ఓవర్‌ బ్రిడ్జిపైకి వచ్చి 100కు డయల్‌ చేశాడు. ఫ్లై ఓవర్‌పై ఎవరో బాంబు పెట్టారని చెప్పగా లోకేషన్‌ ఆధారంగా పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఫ్లై ఓవర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో బాంబ్‌ స్క్వాడ్‌తో తనిఖీలు చేసి అది ఫేక్‌ కాల్‌ అని తేల్చారు. ఫోన్‌ నెంబర్‌ ఆధారంగా అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

బెల్ట్‌ షాప్‌పై దాడి.. నిందితుడి అరెస్ట్‌

చార్మినార్‌: నిబంధనల విరుద్ధంగా పాతబస్తీ పురానాపుల్‌ పార్థివాడాలో బెల్ట్‌ షాపు నిర్వహిస్తున్న ఓ ఇంటిపై దక్షిణ మండలం టాస్కోఫోర్స్‌ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నౌకత్వాలే నితేష్‌ (55)అనే నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి వివిధ బ్రాండ్లకు చెందిన 264 లిక్కర్‌ బాటిల్స్‌ స్వాధీనం చేసుకున్నట్లు దక్షిణ మండలం టాస్క్‌ ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు. కేసు నమోదు చేసి కామాటిపుర పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

దేశ పునర్నిర్మాణమే ఏబీవీపీ లక్ష్యం

చార్మినార్‌: భారతదేశ పునర్నిర్మాణమే లక్ష్యమని ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ ప్రొఫెసర్‌ జానారెడ్డి అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీలో గురువారం సిటీ కళాశాల ఏబీవీపీ కమిటీతో పాటు చార్మినార్‌ నగర కమిటీ నియామకాలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో జాతీయ భావం నింపుతూ నమ్మిన సిద్ధాంతం కోసం జాతీయత పెంపొందించడమే ఏబీవీపీ లక్ష్యమన్నారు. గ్రేటర్‌ హైదరాబాద్‌ మహానగర సంఘటన మంత్రి రాజశేఖర్‌ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే ఏబీవీపీ అతిపెద్ద స్టూడెంట్‌ ఆర్గనైజేషన్‌ అన్నారు. జిల్లా కన్వీనర్‌ ఉదయ్‌, సిటీ కళాశాల అధ్యక్షులు సజన్‌, చార్మినార్‌ నగర కార్యదర్శి రాహుల్‌, హాస్టల్‌ కన్వీనర్‌ రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ..

సిటీ కళాశాల ఏబీవీపీ అధ్యక్షుడిగా జితేందర్‌, కార్యదర్శిగా అక్షయ్‌, ఉపాధ్యక్షులుగా సంతోష్‌, రేఖ, శీను, శివ, కీర్తి నియమితులయ్యారు. అలాగే నగర కమిటీలో నగర అధ్యక్షుడిగా ప్రొఫెసర్‌ గిరిధర్‌, నగర కార్యదర్శిగా రవితేజ, ఉపాధ్యక్షులుగా సందీప్‌, అరుంధతి, సంయుక్త కార్యదర్శులుగా లక్ష్మణ్‌, హరికృష్ణ, స్పోర్ట్స్‌ కన్వీనర్‌ మధు, సోషల్‌ మీడియా కన్వీనర్‌గా సురేందర్‌ నియమితులయ్యారు.



బాపూఘాట్‌ పరిసర ప్రాంతాలు శుభ్రం

సాక్షి ఎఫెక్ట్‌



బాపూఘాట్‌ వెళ్లే దారిలో చెట్లను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

లంగర్‌హౌస్‌: ఎట్టకేలకు బాపూసమాధి, బాపూఘాట్‌ ప్రాంతాలలో శుభ్రం చేసి, దారిలో పెరిగిన చెట్లు తొలగించి, చెత్తను తీసివేశారు. అయితే జీహెచ్‌ఎంసీ అధికారులు సమస్యను పరిష్కరించగా ఇప్పటికీ కూడా పర్యాటక శాఖ మాత్రం పట్టనట్లు ఉంది. లంగర్‌హౌస్‌ బాపూఘాట్‌, బాపూసమాధి ప్రాంతాలతో పాటు వెళ్లే దారి చెత్త, చెట్లతో రోడ్లు మాయమయ్యాయి. 35 ఏళ్లుగా లేని అధ్వాన పరిస్థితి ఇక్కడ నెలకొంది. సాక్షిలో ఈనెల 25న మహాత్మా మన్నించు శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. స్పందించిన డీఎంసీ నాగేశ్వర్‌, ఏఎంహెచ్‌ఓ ఇర్షద్‌ ఇక్బాల్‌ ఆధ్వర్యంలో సూపర్‌ వైజర్‌ విజయ్‌ అక్కడ సిబ్బందితో కలిసి సమస్యను పరిష్కరించారు. ఇక్కడ పరిరక్షించాల్సిన పర్యాటక శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు.

సోదరిని వేధిస్తున్నాడని బావను పొడిచి చంపారు

ఇద్దరి రిమాండ్‌

గోల్కొండ: సొంత బావను హత్యచేసిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన గోల్కొండ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం విలేకర్ల సమావేశంలో ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌ వివరాలు వెల్లడించారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన మహ్మద్‌ సలీం(42)కు 15 ఏళ్ల క్రితం టోలిచౌకీ జమాలికుంటకు చెందిన అర్షియానుజ్రత్‌తో వివాహం జరిగింది. సలీం పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. కొన్ని నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 17న మరోసారి గొడవ జరగడంతో అర్షియానుజ్రత్‌ పుట్టింటికి వచ్చింది. తమ సోదరిని తరచూ వేధిస్తున్నాడని సోదరులు మహ్మద్‌ సిద్దిఖ్‌ అలియాస్‌ అముద్‌(33), మహ్మద్‌ రాషేద్‌(28) ఈ నెల 22న బావ మహ్మద్‌ సలీంను ఇంటికి పిలిపించారు. బావను ఎలాగైనా కడతేర్చాలని ముందుగానే పథకం పన్ని ఇంట్లో పదునైనా కత్తిని సిద్ధంగా ఉంచుకున్నారు. సాయంత్రం మహ్మద్‌ సలీం వీరి ఇంటికి వచ్చి మాట్లాడుతుండగా మాటామాటా పెరుగుతుండటంతో సలీం ఇంట్లోంచి బయటకు వెళ్తుండగా మహ్మద్‌ రాషేద్‌ వెంబడించి కత్తితో బావ తల, భుజం, ముఖంపై విచక్షణరహితంగా దాడి చేశాడు. ఆ తర్వాత మహ్మద్‌ సిద్దిక్‌ రాషేద్‌ వద్దనున్న కత్తి తీసుకుని బావ సలీం తల పగిలే వరకు దాడి చేశాడు. చనిపోయాడని నిర్ధారించుకుని ఇద్దరు పారిపోయారు. విషయం తెలుసుకున్న సలీం సోదరుడు మహ్మద్‌ హనీఫ్‌ గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు హంతకుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈనెల 25న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహ్మద్‌ సిద్దిఖ్‌పై గోల్కొండ పోలీస్‌ స్టేషన్‌లో రెండు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌, ఇన్‌స్పెక్టర్‌ సైదులు

అవయవదానంతో ఇతరుల ప్రాణాలు కాపాడొచ్చు

అఫ్జల్‌గంజ్‌: అవయవదానంతో ఇతరులకు పునర్జన్మ ప్రసాదించే అవకాశం ఉంటుందని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ నరేందర్‌కుమార్‌ అన్నారు. గురువారం ఆసుపత్రిలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రాకేష్‌ సహాయ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రిన్సిపాల్‌ నరేందర్‌కుమార్‌ పాల్గొని మాట్లాడారు. గత నెలలో బ్రెయిన్‌ డెడ్‌ అయిన ఇద్దరు వ్యక్తుల నుంచి సేకరించిన అవయవాల ద్వారా ఇద్దరికి కాలేయ మార్పిడి, నలుగురికి మూత్రపిండాల మార్పిడి, నలుగురికి కార్నియా మార్పిడి, కాలిన గాయాలకు గురైన వారికి అతికించేందుకు అవసరమైన చర్మాన్ని సేకరించినట్లు తెలిపారు. నల్గొండ జిల్లాకు చెందిన డాక్టర్‌ రవి సుందర్‌ (46) గత నెలలో అనారోగ్యానికి గురి కాగా ఉస్మానియాలో చేర్పించారు. కాలేయ మార్పిడి అవసరమని వైద్యులు నిర్ధారించారు. అదే సమయంలో మహబూబ్‌నగర్‌ జిల్లా, హన్వాడ మండలానికి చెందిన గుంత చెన్నయ్య (25) గత నెల 26న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలై ఉస్మానియాలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌ డెడ్‌తో మృతిచెందాడు. ఉస్మానియా వైద్యులు జీవన్‌ దాన్‌ ట్రస్ట్‌ సభ్యుల సహకారంతో అవయవదానంపై అవగాహన కల్పించారు. చెన్నయ్య తండ్రి గోపాల్‌తో పాటు కుటుంబీకులు చెన్నయ్య అవయవాలు దానం చేసేందుకు అంగీకరించారు. అతడి కాలేయాన్ని రవి సుందర్‌కు అమర్చారు. ఆయనను గురువారం డిశ్చార్జ్‌ చేశారు.